RNI NO:APTEL/2018/76747

# నవతరం

తెలుగు దినపత్రిక

NAVATARAM TELUGU DAILY

ఎడిటర్: శిరిగిరి వరదరాజు

పబ్లిష్: రాజమహేంద్రవరం, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లా, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, వెస్ట్ గోదావరి సంపుటి:11 సంచిక: 41 మంగళవారం, 24-02-2026 పేజీలు:4 వెల:1.00

## సిక్కింలో 'ఆపరేషన్ హిమ్రాహత్'..

తూర్పు సిక్కింలో భారీ హిమపాతం కారణంగా చిక్కుకుపోయిన 46 మంది పర్యాటకులను భారత సైన్యం సురక్షితంగా కాపాడింది. 'ఆపరేషన్ హిమ్రాహత్' పేరుతో చేపట్టిన ఈ సహాయక చర్యలు విజయవంతమయ్యాయని అధికారులు వెల్లడించారు. క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల్లో సైన్యం వేగంగా స్పందించి పర్యాటకులను రక్షించింది. రక్షణ శాఖ అధికారుల కథనం ప్రకారం నిన్న తూర్పు సిక్కింలోని ఎత్తైన ప్రదేశాలలో ఒక్కసారిగా భారీగా మంచు



కురిసింది. ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు పడిపోవడంతో పలు మార్గాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పదుల సంఖ్యలో పర్యాటకుల వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే ఆ ప్రాంతంలోని సైనిక బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించాయి. చిక్కుకుపోయిన పర్యాటకులను సమీపంలోని ఆర్మీ క్యాంపునకు తరలించి వారికి తక్షణ వైద్య పరీక్షలు నిర్వహించారు. వెచ్చని దుస్తులు, వేడి భోజనం, తాత్కాలిక నివాస సౌకర్యాలు కల్పించి చలి తీవ్రత నుంచి కాపాడారు. పర్యాటకులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని నిర్ధారించుకున్న తర్వాతే వారి ప్రయాణానికి ఏర్పాట్లు చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ప్రమాదకరంగా నిలిచిపోయిన 150కి పైగా వాహనాలను కూడా సైన్యం సురక్షిత ప్రాంతాలకు చేర్చింది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో భారత సైన్యం అందించే మానవతా సహాయక చర్యలకు 'ఆపరేషన్ హిమ్రాహత్' ఒక నిదర్శనమని అధికారులు కొనియాడారు.

## సోలార్ పవర్ వైపు ఆసక్తి చూపుతున్న ప్రజానీకం



**నవతరం, పలాస**

పర్యావరణ పరిరక్షణతో పాటు స్థిరమైన అభివృద్ధి జరగాలంటే తరిగిపోని శక్తి వనరులు అత్యంత అవసరం. అపరిమితంగా లభ్యమవుతూ, ఎన్నటికీ తరిగిపోని ఇంధన వనరులలో సౌర శక్తి ఒకటి. ఇంధన భద్రతతో పాటు తక్కువ నిర్వహణ ఖర్చుతో దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించే సోలార్ విద్యుత్తుకు ప్రపంచం మొత్తంలోనూ ప్రాధాన్యం పెరుగుతుంది. ఈ మధ్యకాలంలో వచ్చిన అధునాతన సాంకేతిక మార్పుగా అవతరించి, సామాజికంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న వాటిలో ' సోలార్ విద్యుత్ ప్యానెల్స్ హవా కొనసాగుతున్నాయి. ఈ అంశం సామాజిక జీవన వైవిధ్యంలో పెనుమార్పులకు నాంది పలుకుతున్నాయి. ఒకవైపు విపరీతంగా పెరిగిపోతున్న విద్యుత్ చార్జీలు, వెరసి అందరి చూపు సోలార్ విద్యుత్ వైపునకు మళ్లింది. దశాబ్ద కాలం గానే సోలార్ కు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నప్పటికీ అది నగరాల వరకే పరిమితమైంది. కానీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పియం సూర్యగర్ ముఫ్ బిజిలి యోజన పథకంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ సోలార్ సెట్ పై ఆసక్తి చూపుతున్నారు. ఈ స్కీమ్ లో భాగంగా దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు పైగా సోలార్ వ్యవస్థను వ్యాప్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ప్రత్యేక సబ్సిడీలను సైతం అందిస్తున్నారు. కొన్నేళ్లుగా సోలార్ వ్యవస్థ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వ్యాపార సంస్థల సైతం ఈ సందర్భంగా వారి సేవలు పెంచుతున్నాయి. సౌర శక్తి సామర్థ్యంలో భారతదేశంలోని అగ్రగామి రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలుస్తుంది. సోలార్ విద్యుత్ వినియోగించే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఇప్పుడిప్పుడే ఈ విధానానికి అలవాటు పడుతున్నారు. ఈ సోలార్ పద్ధతులు వ్యక్తిగత గృహాలతో పాటు చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమల్లోనూ విరివిగా వాడుతున్నారు. వారి వారి విద్యుత్ వాడకానికి అనుగుణంగానే పీఎం సూర్య ఘర్ స్కీములో ఒక కిలో వాట్ నుంచి వినియోగాన్ని బట్టి, అవసరమైనన్ని కిలోవాట్ల సోలార్ సెట్ లను, వాటికి సబ్సిడీని అందిస్తుంది. గతంలో ఇళ్ల లో రూ 250 నుంచి రూ. 500ల కరెంట్ బిల్లు అత్యధికంగా అనుకుంటే, ఇప్పుడు అది దాదాపు 1000 నుంచి పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో సౌర శక్తి ఉత్పత్తిని మెరుగుపరచడానికి ' ప్రధానమంత్రి సూర్య ఘర్ ముప్తి బిజిలి యోజన పథకం 2024 లో ప్రారంభమైంది. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సోలార్ సబ్సిడీ పథకం పేద ప్రజల్లో సైతం వెలుగులు నింపుతుంది. తక్కువ పెట్టుబడితో సొంత బిల్డింగ్ పైన సోలార్ ప్యానల్ నెంబర్ చూస్తే మనం ఉత్పత్తి చేసే విద్యుత్ ద్వారా మనకు వచ్చే విద్యుత్ చార్జీలను పూర్తిగా తగ్గించుకోవచ్చు. మనం వినియోగించుకున్న విద్యుత్ సరిపోగా మిగిలిన విద్యుత్తును గ్రిడ్ కైనా పంపిణీ చేయడం వల్ల తిరిగి లబ్ధిదారులకి ఆదాయం పొందడానికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. ఒక మాటలో చెప్పాలంటే సోలార్ పవర్ వినియోగదారులే ఉత్పత్తిదారులు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలో పాటు ఇచ్చాపురం, టెక్కలి నియోజకవర్గా లలో సోలార్ విద్యుత్తు పై గృహ వినియోదారుల్లో చైతన్యం పెరుగుతుంది. సూర్య ఘర్ కింద ఎవరైతే సోలార్ విద్యుత్ వినియోగించుకో దలుచు కున్నా రో వారందరికీ బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తున్నాయి. అయితే ఈ సోలార్ సిస్టం ఎంచుకునేటప్పుడు ఆమోదిత బ్రాండ్లను ఎంపిక చేసుకోవలసి ఉంది. ఇందులో బ్లూ బర్డ్ సోలార్, టాటా పవర్ సోలార్, వారి ఎనర్జీస్, విక్రమ్ సోలార్, అదానీ సోలార్, రెన్యుసిస్ వంటి అగ్రశ్రేణి సోలార్ ప్యానల్ తయారీదారులు. అదేవిధంగా సోలార్ ప్యానల్ ఇన్స్టలేషన్



తోపాటు దీర్ఘకాలం మన్నిక వచ్చే విధంగా సర్వీస్ సెంటర్ కూడా ముఖ్యం. పలాస కేంద్రంగా వారాహి సోలార్ ఎంటర్ప్రైజెస్ వినియోగదారులకు అవగాహన ప్రభుత్వ అధికార యంత్రాంగం తో పాటు కొన్ని స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో

**గ్రామ సీమల్లో సోలార్ వెలుగులు**

**పీఎం సూర్య ఘర్ పథకానికి ఆదరణ**

**థర్మల్ విద్యుత్ కంటే సోలార్ విద్యుత్ వైపు జనం మొగ్గు**

**లబ్ధిదారులకు రుణ సదుపాయం**

**వినియోగదారులకు బ్రాండెడ్ కంపెనీ సామాగ్రి మరియు ఉత్తమ సర్వీస్ అందిస్తున్న వారాహి ఎంటర్ ప్రైజెస్**

క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తుంది. అందులో భాగంగా ఆదివారం నాడు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద విద్యుత్ శాఖ అధికారులతో పాటు వివిధ బ్యాంకుల అధికారులతో కలిసి అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు వారాహి సోలార్ పవర్ ఎంటర్ ప్రైజెస్ నిర్వాహకులు రెయ్య నారాయణ రావు, కొర్రయి శ్రీకాంత్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 9885549657 నెంబర్ కి ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు అన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ

### మార్చి 4న భారీ ర్యాలీ... మంత్రులు సమక్షంలో సభ

### పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్నదే ప్రధాన లక్ష్యం

**నవతరం, అక్కయ్యపాలెం**

రాష్ట్ర వ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టుల పెండింగ్ సమస్యల పరిష్కారానికే చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (నేషనల్ అలెయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్), ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల కార్యదర్శి గంట్ల శ్రీను బాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం అక్కయ్యపాలెం జంక్షన్‌లోని ఒక ప్రయివేటు హోటల్‌లో ఏపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించి యూనియన్ నేతలు చర్చించారు. అనంతరం గంట్ల శ్రీనుబాబు, నారాయణలు మాట్లాడుతూ జర్నలిస్టులకు సంబంధించిన సుమారు 11 డిమాండ్ల సాధన కోసం చాలా కాలంగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అయితే ఇందులో అక్రిడేషన్‌లు సమస్య కొంత కొలిక్కి వచ్చిందన్నారు. ఇక మిగిలిన డిమాండ్‌లకు సంబంధించి మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని తమ రాష్ట్ర కార్యవర్గం చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ప్రధానంగా జర్నలిస్టుల ఇంటి కల నెరవేరలేదని ప్రభుత్వాలు మారుతున్నా కనీసం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇండ్లు కేటాయించడం లేదన్నారు. అలాగే జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ప్రమాద భీమా పథకాన్ని పునరుద్ధరించాలని, ఇతర రాష్ట్రాల్లో జర్నలి స్టులకు అమలు చేస్తున్న పెన్షన్ విధానం అమలు చేయాలని , మీడియా హక్కుల పరిరక్షణకు ప్రత్యేకంగా మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు కార్పొరేట్ సంస్థల నుంచి ఉచితంగా విద్య, వైద్యం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తామంతా కోరుతున్నామన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు భారీగా రాయితీలు, ప్రోత్సాహకాలు అందజేస్తున్న తరుణంలో సమాజం కోసం పాటు పడుతున్న జర్నలిస్టులకు వారి కుటుంబాలకు కార్పొరేట్ సంస్థల నుంచి ఉచితంగా విద్య, వైద్యం అందించాలన్నారు. అలాగే సుమారు 11 డిమాండ్లతో ఇప్పటికే తాము దశల వారీగా ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో మరోసారి వర్కింగ్ జర్నలిస్టుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వంలో పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలని తమ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందన్నారు.

**మార్చి 4న చలో విజయవాడ**

వర్కింగ్ జర్నలిస్టుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ మార్చి 4న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించాలని తమ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణలు తెలిపారు. ఆరోజు ఉదయం విజయవాడలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తామని క్రమేపీ అది సభగా మారుతుందన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న జర్నలిస్టుల సభకు అతిథులుగా రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారథి, కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్‌లను ఆహ్వానించడం జరిగిందన్నారు. మంత్రులు హాజరుకానున్న ఈ సభలో జర్నలిస్టుల సమస్యలు వివరించి వాటి పరిష్కారాన్ని కోరుతామన్నారు. కావున రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వీరు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి.రవి కుమార్, ఎ.సాంబశివరావు, పితాని ప్రసాద్, ఉపాధ్యక్షులు బి.శివప్రసాద్, ఆనంద్, ఎన్.రామకృష్ణ కృష్ణ పాత్రో, కిషోర్, బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, కింతాడ మధన్, శేషు..స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ మోహన్, కార్యదర్శి బొబ్బర ప్రసాద్ చక్రి, హరి, రెడ్డి, నాయుడు, నగేష్‌బాబు, రాజశేఖర్, సత్యనారాయణతో పాటు పెడరేషన్ ప్రతినిధులు.

### కొండపేటలిఫ్ట్ మరమ్మత్తులు కోసం

## జల దీక్షలు.....!

**తక్షణమే కొండపేట/మణి నాగేశ్వరపురం బిట్టు ప్రణాళిక బద్ధంగా అన్ని గ్రామ పంచాయతీలకు రైతులు నీటిని అందించేందుకు పూర్తిస్థాయి ప్రయత్నాలు చేయాలి......!**

**లిఫ్ట్ ప్రతిపాదనలోనిలక్ష్యాలు నెరవేరలేదు.....!**

**అధికారుల నిర్లక్ష్యము అవగాహనరాహిత్యము రైతులు పాలిటశాపముగా మారింది.....!**

**నవతరం, కోటబొమ్మాలి:**

కొండపేట లిఫ్ట్ మరమ్మతులు చేయాలను కోరుతూ మార్చి 4వ తేదీన జగన్నాధపురంలో జల దీక్షలు చేయాలని సమావేశం నిర్ణయించింది రైతు కన్నీరు ఆగాలంటే వంశధార నీరు రావాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు సిఐటియు జిల్లా కార్యదర్శి హెచ్ ఈశ్వర అన్నారు. కోటబొమ్మాలి మండలం జగన్నాధపురం గ్రామ యువజన సంఘం కార్యాలయంలో జరిగిన కోటబొమ్మాలి మండలం కొండపేట లిఫ్టు ఇరిగేషన్ జల సాధన కమిటీ విస్తృతస్థాయి సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కొండపేట ఎత్తిపోతల పథకం నాసిరకం పనులు వలన 2019లో ప్రారంభిస్తే 2020కే మరా మత్తులకుగురై నీరు ఆగిపోయిందని దీంతో రైతాంగం తీవ్రమైన నష్టానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కొండపేట లిఫ్టు పరిధిలో 22 గ్రామాలు లలో 2500 ఎకరాలు కు సాగునీరు అందక సరైన పంటలు పండక రైతాంగం వలసలు వెళ్ళవలసి వచ్చిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు లేక రైతాంగం పంటల పండగ పెట్టిన పెట్టుబడికి వడ్డీలు కట్టలేక అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు, ఎన్నికల్లో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు గారు అధికారంలోకి వచ్చిన వెంటనే లిఫ్ట్ మరమ్మత్తులు చేసి నీరు ఇస్తామన్నా హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొండపేట లిఫ్ట్ బాగుచేసి వెంటనే నీరు ఇవ్వాలని కోరుతూ లిఫ్టు పరిధి గ్రామాలలో చైతన్య సభలు, అధికారులకు వినతి పత్రాలు, సంతకాలు సేకరణ చేయాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో లిఫ్ట్ ఇరిగేషన్ జల సాధన కమిటీ సభ్యులు. సనపల నారాయణరావు గుంట అప్పన్న జి అప్పలరాజు సనపల ఖజానారావు జి లక్ష్మణరావు సింగూరు విశ్వనాథం గుంట




దాలయ్య ఎస్ స్వాతి శ్యామలమ్మ నాగమణి రోహిణి కుసుమ సూరమ్మ మాణిక్యము జయమ్మ పున్నమ్మ భాగ్యం తేజమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమకారుల ఆత్మగౌరవ పోరాటానికి దక్కిన విజయం


# కవితక్క గర్జనతో దిగివచ్చిన సర్కార్

**తెలంగాణ జాగృతి పోరాట పటిమకు నిదర్శనం**

**ఉద్యమకారుల పక్షాన కవితక్క ఉంటే..**

**కేటీఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారు?**

రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి సూటి ప్రశ్న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం సాగుతున్న పోరాటం సత్ఫలితాలను ఇచ్చిందని, ఇది తెలంగాణ జాగృతి పోరాట పటిమకు దక్కిన విజయమని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేఖరులకు అందజేసిన ఒక ప్రకటనలో ఆయన ప్రస్తుత రాజకీయ పరిణామాలు మరియు ఉద్యమకారుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన తీరును వివరించారు. జై తెలంగాణ.. అని గర్జించిన ఆ ఉద్యమ గొంతుకలు పునరాలోచనలో పడ్డాయి. స్వరాష్ట్ర సాధనతో సంబురపడ్డ ఆ గుండెలకు పుష్కర కాలమైనా ఆశించిన ఆత్మగౌరవం దక్కక అల్లాడుతున్న ప్రస్తుత పరిస్థితులలో రాష్ట్ర కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారుల హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని పాండురంగారెడ్డి స్పష్టం చేశారు. "ఉద్యమకారుల సమస్యలను గాలికొదిలేస్తే బంగ్లా బయటకు గుంజుతారు" అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గారు చేసిన శక్తివంతమైన హెచ్చరికతోనే రాష్ట్ర ప్రభుత్వంలో చలనం వచ్చిందని ఆయన అన్నారు. ఈ ఒత్తిడి ఫలితంగానే రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గారు స్వయంగా వచ్చి ఉద్యమకారుల సమస్యలను వినడం, వారికి తక్షణమే న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు.



ఇదే సందర్భంలో బిఆర్ఎస్ పార్టీ వైఖరిని పాండురంగారెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. ఒకవైపు కవితక్క ఉద్యమకారుల కోసం అలుపెరగని పోరాటం చేస్తుంటే, మరోవైపు కేటీఆర్ గారు ఉద్యమకారుల విషయంలో కనీసం నోరు మెదపకపోవడం విస్మయం కలిగిస్తోందని అన్నారు. "అధికారంలో ఉన్నప్పుడు ఉద్యమ ద్రోహులకు పెద్దపీట వేసి, అసలైన ఉద్యమకారుల ఉనికి లేకుండా చేశామన్న అపరాధ భావనతోనే కేటీఆర్ గారు ముఖం చాటేస్తున్నారా? లేక తన తప్పును ఇంకా తెలుసుకోలేదా?" అని తెలంగాణ సమాజం తరపున ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులకు ఏ కష్టం వచ్చినా, వారి ఆత్మగౌరవానికి భంగం వాటిల్లినా కవితక్క ఎల్లప్పుడూ ముందు వరుసలో నిలబడి పోరాడుతారని ఈ పరిణామం మరోసారి రుజువు చేసిందని పాండురంగారెడ్డి అన్నారు. ఉద్యమకారుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తెలంగాణ జాగృతి విశ్రమించదని ఆయన స్పష్టం చేశారు.

# ఘనంగా డాక్టర్ అప్పలరాజు పుట్టినరోజు వేడుకలు



**నవతరం, పలాస/ మందస**

వైయస్సార్సీపి రాష్ట్ర నాయకులు, మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పుట్టినరోజు వేడుకలు పలాస నియోజకవర్గమంతా జరిగాయి. ఆదివారం పలాస కేంద్రంతోపాటు వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో వైఎస్ఆర్సిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. తొలుత మందస లో వాసుదేవ పెరుమాళ్ దేవాలయంలో వైఎస్ఆర్సిపి యువజన నాయకుడు సేనాపతి కిషోర్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైయస్సార్సీపి శ్రేణులు నడుమ బర్త్ డే కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మందస ఎంపీపీ డొక్కరి దానయ్య యాదవ్ మాట్లాడుతూ, పలాస నియోజకవర్గానికి గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం లో రూపురేఖలు మార్చిన ఘనత రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కే దక్కుతుందన్నారు. ఉద్దానం ప్రాంతాన్ని కిడ్నీ వ్యాధి రహితంగా మార్చేందుకు నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఒప్పించి ఏకంగా 700 కోట్ల రూపాయల వ్యయంతో ఇంటింటా శుద్ధి చేయబడిన జలాలు సరఫరా చేసే విధంగా వైయస్సార్ సుజల ధార ప్రాజెక్టు మంజూరు చేయించి, వంశధార నదీ జలాలు పలాస తో పాటు ఇచ్చాపురం నియోజకవర్గం వరకు త్రాగునీరు అందించే బృహత్తర పథకానికి పునాది వేసిన అభివృద్ధి ప్రదాత డాక్టర్ అప్పలరాజు అని ఆయన కొనియాడారు. అదేవిధంగా సుమారు 70 కోట్లు రూపాయల నిధులతో పలాసలో కిడ్నీ రీసెర్చ్ కేంద్రం నెలకొల్పేరన్నారు. అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి గ్రామ సచివాలయ భవనాలతో పాటు అనుబంధ రంగాల భవనాలను కూడా నిర్మించడమే కాక, నాడు- నేడు మనబడి పథకం కింద ప్రభుత్వ స్కూల్స్ ఆధునికరించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. పలాస కేంద్రం వైయస్సార్సీపి కేంద్ర కార్యాలయమైన ప్రగతి భవన్ వద్ద వైఎస్ఆర్సిపి పలాస పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పైల చిట్టి ఆధ్వర్యంలో బర్త్ డే కేక్ కటింగ్ చేశారు. అదేవిధంగా వజ్రపుకొత్తూరు మండల కేంద్రంలో వైఎస్ఆర్సిపి నేతలు తిర్రి రాజారావు, దువ్వాడ మధుకేశ్వరరావు నేతృత్వంలో డాక్టర్ అప్పలరాజు జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం పలాసలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్స్ లో రోగులకు పండ్లు, రొట్టెలు, ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు చింతాడ గణపతి, కర్రి గోపాల్, దల్లి జానకి రెడ్డి, బత్తిన లక్ష్మణ్, సిందిరి జగన్, సొర్ర ఢిల్లేశ్వర్ రావు, పందిరి బైరాగి, కొర్రాయి గోపి, వై. సంతోష్, అంబటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు రాష్ట్ర మహాసభల సందర్భంగా నంది సాంస్కృతిక కార్మిక ఉత్సవాలను జయప్రదం చేయండి

### సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి పిలుపు

**నవతరం, నంద్యాల**

సిఐటియు రాష్ట్ర 17వ మహాసభలు నంద్యాల పట్టణంలో 2026 ఏప్రిల్ 17, 18, 19 తేదీలలో జరుగుతున్నాయి. ఈ మహాసభల సందర్భంగా నంది సాంస్కృతిక కార్మిక ఉత్సవాలు ఏప్రిల్ 14, 15, 16, 17 తేదీలలో సాంస్కృతిక కార్మిక ఉత్సవాలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ కందారపు మురళి పిలుపునిచ్చారు. స్థానిక నంద్యాల పట్టణంలోని సుందరయ్య భవన్లో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ కందారపు మురళి హాజరై మాట్లాడుతూ ఉద్యోగ కార్మిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిత్యం ఆందోళన పోరాటాలు చేస్తుందని కార్మిక హక్కులు సంక్షేమంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలో విదేశీ పరిశ్రమల రక్షణ కోసం ఐక్య పోరాటాలు నిర్వహిస్తుందని సంస్కరణల పేరిట పడుతున్న బారాలపై ప్రజానీకాన్ని చైతన్యవంతం చేస్తూ పోరాటాలు నిర్వహిస్తుందని స్కీం వర్కర్లు ఇతర అసంఘటిత కార్మికుల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని పకృతి వైపరీత్యాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సందర్భంలో సేవా కార్యక్రమానికి తోడ్పాటు అందిస్తుందని ఈ నేపథ్యంలో సిఐటియు రాష్ట్ర మహాసభలో మొట్టమొదటిసారిగా నంద్యాల పట్టణంలో 2026 ఏప్రిల్ 17, 18, 19 తేదీలలో సిఐటియు రాష్ట్ర మహాసభలో జరుగుతున్నాయని ఈ రాష్ట్ర మహాసభల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నంద్యాల పట్టణంలో నీ టౌన్ హాల్ నందు నాలుగు రోజులపాటు జరుగుతాయని ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో సినీ నిర్మాతలు సుద్దాల అశోక్ తేజ, మంగ్లీ, సినీ నిర్మాతలు పాల్గొంటున్నారని అలాగే రాష్ట్రవ్యాప్తంగా సాంస్కృతిక కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వీటన్నిటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.





కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికా రంలోకి వచ్చిన తర్వాత మరింత దూకుడుగా వ్యవహరిస్తుందని కార్మిక వర్గం అనేక త్యాగాలతో సాధించుకున్నటువంటి 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోట్లుగా మార్చి కార్మికులను కట్టు బానిసల్లగా చేస్తుందని లాభాల్లో నడుస్తున్నటు వంటి ప్రభుత్వ రంగ సమస్యలన్నిటిని కారు చౌకగా అమ్మి వేసే ప్రయత్నం చేస్తుందని మన రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వంగ సంస్థ అయినా విశాఖ స్టీల్ ప్లాంట్ని ముక్కలు చేసి అమ్మాలని విష్ణ ప్రయత్నాలు చేస్తుందని దీనికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యోగులు కార్మికులుకు సన్నద్ధం కావాలని విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటా యించకుండా ప్రైవేట్ మిట్టల్ కంపెనీలకు గనులను కట్ట బెడుతున్నారని చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటు చేతుల్లో పెట్టేందుకు పావులు కలుపుతున్నారని ప్రత్యేక హోదా ఇవ్వకపోగా విభజన హామీలు అమలు చేయకపోగా కడప ఉక్కు పరిశ్రమ స్థాపనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని రాష్ట్ర ప్రయోజ నాలను దెబ్బతీస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించకపోగా వంత పాడటం దుర్మా ర్గమైన చర్య అని ఎనిమిది గంటల పని విధానాన్ని 10 గంటలకు 12 గంటలకు పెంచిందని మహిళలకు రాత్రిపూట చెట్లలో పనిచేసుకునేందుకు అనుమతిస్తూ చట్టం చేసిందని ఇది కార్మికులను మరింత దోపిడీ చేయడానికి అవకాశం కల్పించిందని వీటికి వ్యతిరేకంగా కార్మికులు ఉద్యోగులు ప్రజలందరూ సిఐటియు రాష్ట్ర మహాసభల సందర్భంగా జరుగు నంది సాంస్కృతిక కార్మిక ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య కేఎండి గౌస్ సిఐటియు కోశాధికారి ఏ తిరపతయ్య, రమణకుమారి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వి బాల వెంకట్, డి లక్ష్మణ్, వెంకట్ లింగం, నిర్మలమ్మ, రామ్ నాయక్ లు పాల్గొన్నారు.

(కవి సమ్మేళనంలో పోలయ్య కవి కూకట్లపల్లి చదివి వినిపించిన కవిత)

**జై తెలుగు తల్లి...**
**జయహో తెలుగు తల్లి..!**

నా "తెలుగు"...
నాకు వెలుగు
జాతికి ఆరనిజ్యోతి
జగతికి రవికిరణం..!

నా "తెలుగు జాతి"...
ప్రేమకు ప్రతిరూపం..!

నా "తెలుగు నేల"...
అల్లూరి ఆవేశానికి అగ్నిజ్వాల...
పల్నాటి పౌరుషానికి ప్రతిబింబం..!

నా "తెలుగు భాష"...
తేనెలూరే తియ్యని భాష
అది 56 అక్షరాల క్షీరధార..
గలగలపారే గంగా గోదావరి క్రిష్ణా
కావేరి తుంగభద్ర సజీవ నదుల
జలధార..!

నా "తెలుగు భాషా వైభవం"...
కవిత్రయ కవికోకిలల
భారత భాగవత రామాయణ
బృహత్ గ్రంధాల సుగంధ
సౌరభం...
అన్నమయ్య క్షేత్రయ్య
రామదాసు కీర్తనల ప్రణవ నాదం...
శ్రీనాధ విశ్వనాథ పోతన
వేమన గిడుగు గుర్రం జాషువా
గురజాడ శ్రీ శ్రీ పద్యాల సింహ గర్జన..!
నా "తెలుగు తల్లి" ఒడి...
నా తెలుగు జాతికి బడి గుడి...
అది మన ఆత్మగౌరవ ఆశల పల్లకి
మన మాతృభాష కేవలం భాష కాదు
అది మన శ్వాస మన
స్వాభిమానం..!
అందుకే..
ఏ దేశమేగినా ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా పొగడరా
నీ "తెలుగుతల్లి" భారతిని ...
నిలపరా నిలుపరా
నీ "తెలుగుజాతి" నిండుగౌరవం...
అంటూ ముక్త కంఠంతో
తెలుగుజాతి నినదించాలి
ఆంగ్లభాషా ఐసీయూలో ఉన్న
మన మాతృభాషను
పరిరక్షించుకోవాలి
జై తెలుగు...జయహో జయహో
తెలుగు.

రచన:
కవి రత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
**పోలయ్య కూకట్లపల్లి**
అత్తాపూర్ హైదరాబాద్

# ఇళ్లపై దాడుల సంస్కృతికి స్వస్తి పలకాలి

### చంద్రబాబుపై తీవ్రస్థాయిలో ముద్రగడ పద్మనాభం విమర్శలు

గుంటూరు: వైసీపీ సీనియర్ నేత, కాపు ఉద్యమ ప్రముఖుడు ముద్రగడ పద్మనాభం ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల



గుంటూరులో దాడికి గురైన మాజీ మంత్రి అంబటి రాంబాబు నివాసాన్ని ఆయన సోమవారం సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ.. కూటమి పాలనలో వైసీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని ఆరోపించారు. అంబటి ఇంటిపై దాడి బాధాకరమని, ఇళ్లపై దాడులు చేసే సంస్కృతి మంచిది కాదని హితవు పలికారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా, బాధితుడైన అంబటినే జైల్లో పెడతారా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ పర్యటనలో అంబటి కుమార్తె మౌనికను ప్రత్యేకంగా అభినందించిన ముద్రగడ, ఆమెను 'ఫైర్‌బ్రాండ్' అని అభివర్ణించారు. భవిష్యత్తులో ఆమె పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం చంద్రబాబుపై ముద్రగడ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కాపుల ఓట్లతో రెండుసార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక మళ్లీ కాపులనే వేధిస్తున్నారు. నాడు నన్ను, నా కుటుంబాన్ని తీవ్రంగా అవమానించారు, ఇప్పుడు అంబటిని టార్గెట్ చేశారు. మాకు జరిగిన అవమానాలు మీ కుటుంబ సభ్యులైన భార్య, కొడుకు, కోడలికి జరిగితే ఎలా ఉంటుందో ఆలోచించండి" అని చంద్రబాబును ఉద్దేశించి ప్రశ్నించారు. కాపులు బానిసలు కాదని, తమను అవమానించడం ఆపాలని స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలోనూ కూటమి ప్రభుత్వం రోజూ అబద్ధాలు ఆడుతోందని ముద్రగడ విమర్శించారు. "ఇకనైనా అబద్ధాలు ఆపి శ్రీవారికి క్షమాపణ చెప్పండి లేదా కనీసం లడ్డూ గురించి మాట్లాడటం మానేయండి" అని సూచించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కక్ష సాధింపు చర్యలు, ఇళ్లపై దాడులకు స్వస్తి పలకాలని ప్రభుత్వానికి హితవు పలికారు. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ముద్రగడ వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకున్నట్లయింది.

# మడియ రామకృష్ణకు అగ్నికుల క్షత్రియ పెద్దలు పరామర్శ

**నవతరం, మందస**



వైయస్సార్సీపీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి, అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మడియ రామకృష్ణకు ఇటీవల అత్తగారైన దున్న నాయనోరు బాలమ్మ వియోగం కలిగింది. ఆమె మృతి పట్ల అగ్ని కుల క్షత్రియ పెద్దలు బాలిగం పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు సొర్ర ఢిల్లీ శ్వరరావు, వైయస్సార్ ఉద్యాన వర్సిటీ పాలకమండలి మాజీ సభ్యులు బత్తిన లక్ష్మణ్, నారాయణపురం సర్పంచ్ బత్తిన తేజేశ్వరరావు, వైసిపి నేతలు గోరకల కేశవరావు, దున్న హరికృష్ణ, తులసిరావు, జగన్ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, మడియా రామకృష్ణ కు మరియు కుటుంబ సభ్యులకు ఓదార్చారు.

# బీజేపీ ఎంపీ నాగేన్ రాయ్‌కి 'బంగ విభూషణ్' పురస్కారం

పశ్చిమ బెంగాల్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇలాంటి సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రభుత్వం ఒక బీజేపీ ఎంపీకి రాష్ట్ర పురస్కారం అందించడం ఆసక్తికరంగా మారింది. బీజేపీ ఎంపీ నాగేన్ రాయ్ సహా పలువురికి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాష్ట్ర పౌర పురస్కారం 'బంగ విభూషణ్' అందించారు. బెంగాల్‌లో బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీల మధ్య నిత్యం ఘర్షణ వాతావరణం ఉంటుంది. ప్రస్తుతం అక్కడ ఈ రెండు పార్టీల మధ్య తీవ్ర పోరు నెలకొని ఉంది. ఇలాంటి తరుణంలో బీజేపీ ఎంపీకి పురస్కారం అందించడం గమనార్హం. నాగేన్ రాయ్ రాజ్ బాంగ్షీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. ఉత్తర, మధ్య బెంగాల్‌లో ఈ వర్గం ప్రజలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతంలో టీఎంసీ పేలవ ప్రదర్శన కనబరచగా, బీజేపీకి మంచి ఫలితాలు వచ్చాయి. 2023లో నాగేన్ రాయ్ రాజ్యసభ ఎంపీగా నామినేట్ అయ్యారు. రాజ్ బాంగ్షీ వర్గం ప్రజలు ఆయనను అనంత్ మహారాజ్‌గా పిలుచుకుంటారు. ముర్షిదాబాద్, మాల్దా, డార్జిలింగ్, ఉత్తర్ దీనాజ్‌పూర్, జల్ పాయ్ గుడీ వంటి ప్రాంతాల్లో రాజ్ బాంగ్షీ ప్రజలు ఉన్నారు. ఈ వర్గంలో బీజేపీ ఎంపీకి పలు కుబడి ఉంది. ఇప్పుడు ఎన్నికలు సమీపించిన సమయంలో ఆ సామాజిక వర్గం బీజేపీ ఎంపీకి పురస్కారం ఇవ్వడం గమనార్హం. నాగేన్ గతంలో టీఎంసీకి దగ్గరగా ఉండేవారనే వాద నలు ఉన్నాయి.

Printed by SIRIGIRI VARADARAJU, and published by SIRIGIRI VARADARAJU, on behalf of SIRIGIRI VARADARAJU, and printed at : Krathi Publications, D.No.18-11-12/1, Krishna Nagar, ward-39, RAJAHMUNDRY, EAST GODAVARI DIST. ANDHRA PRADESH STATE - 533 101, Published at : Kranthi Publications, D.No. : 18-11-12/1, Krishna Nagar Ward-39, RAJAHMUNDRY, EAST GODAVARI DIST, ANDHRA PRADESH STATE - 533101, Editor : SIRIGIRI VARADARAJU, Email: navataramraju@gmail.com, Cell : 9959007255